సాక్షి
వికారాబాద్

బుధవారం । 26 । జూలై । 2023



ఆయిల్ బాల్..

దోమల నివారణకు అధికారులు క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకుంటున్నారు. ఆయిల్ బాల్స్ పద్ధతిని ఉపయోగిస్తున్నారు. 8లో ▸



పోషకాల కంది

జిల్లాలోని కొడంగల్, తాండూరు నియోజకవర్గాల్లో పండిన కంది దిగుబడులకు మంచి డిమాండ్ లభిస్తోంది. 8లో ▸



క్రమబద్ధీకరణ సంబురాలు

ఉద్యోగులుగా గుర్తించి పేస్కేల్ అమలు చేయడంతో జిల్లాలోని వీఆర్ఏలు ఊరూరా సంబరాలు జరుపుకొన్నారు. 9లో ▸

న్యూస్‌రీల్

నలుగురు ఎస్ఐలకు పోస్టింగ్‌లు

అనంతగిరి: జిల్లాలో నలుగురు ఎస్ఐలకు పోస్టింగ్ ఇచ్చినట్లు ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. సంగారెడ్డి జిల్లా నుంచి బదిలీపై వచ్చిన నలుగురు ఎస్ఐలలో గోపాల్‌కు కొండగల్ ఎస్ఐ–2గా, రాములు పరిగి ఎస్ఐ–2గా, సర్దార్ యాలాల ఎస్ఐగా–2గా, రాణి ధారూరు ఎస్ఐ–2గా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోస్టింగ్ ఇచ్చినట్లు ఎస్పీ తెలిపారు.

ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

ఆర్డీఓ శ్రీనివాస్‌రావు



సెక్టోరియల్ అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాస్‌రావు

తాండూరు రూరల్: అసెంబ్లీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని ఆర్డీఓ శ్రీనివాస్ రావు అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో సెక్టోరియల్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ నియోజకవర్గంలో 266 పోలింగ్ కేంద్రాలున్నాయని చెప్పారు. 23 మంది సెక్టోరియల్ అధికారులను నియమించినట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షించి 47 సమస్యాత్మకమైనవిగా గుర్తించామన్నారు. అదేవిధంగా పోలింగ్ స్టేషన్ల వద్ద మౌలిక సదుపాయాలకు సంబంధించి నివేదిక కూడా సేకరించామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు చిన్నప్పల నాయుడు, విద్యాసాగర్‌రెడ్డి, పట్టణ సీఐ రాజేందర్‌రెడ్డితో పాటు ఎస్ఐలు, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్ అర్బన్: రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలల్లో ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. తెలుగు, హిందీ, ఆంగ్లం, గణితం, భౌతికం, రసాయన, సాంఘిక, జంతు, వృక్ష, అర్థశాస్త్రం, పౌరశాస్త్రం, లైబ్రేరియన్, హెల్త్ సూపర్‌వైజర్ పోస్టులకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల ప్రాంతీయ సమన్వయకర్త డాక్టర్ శారద ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చేవెళ్ల, చిలుకూరు, నార్సింగ్, షేక్‌పేట, కొత్తగడి, కోకట్ (యాలాల), మోమిన్‌పేట (బూర్గుపల్లి), బంట్వారం(తొల్కట్ట), అనంతగిరిపల్లి, పరిగి, కొడంగల్ (ముడిమాల్), పెద్దేముల్ (తాండూరు)లోని పాఠశాల, కళాశాలల్లో పోస్టులు ఉన్నట్లు తెలిపారు. అభ్యర్థులు పీజీ, బీఈడీ, జీఎన్ఎం, బీపీఈడీ, బీఎల్ ఐఎస్సీ అర్హతలు కలిగి ఉండాలన్నారు. చిలుకూరు సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో ఈ నెల 28న శుక్రవారం ఉదయం 9గంటల నుంచి నిర్వహించే డెమోకు సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. ప్రతిభ ఆధారంగా అభ్యర్థుల ఎంపిక ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెం: 94905 22423 ను సంప్రదించాలన్నారు.

శభాష్.. సర్పంచ్



గ్రామస్తులతో కలిసి మురుగుకాల్వలో చెట్టును తొలగిస్తున్న సర్పంచ్

తాండూరు రూరల్: మండల పరిధిలోని కోటబాసుపల్లి సర్పంచ్ ఆదర్శంగా నిలుస్తున్నారు. అందరిలా ఆదేశాలు ఇవ్వకుండా తానే స్వయంగా పనులు చేస్తున్నారు. మురుగు కాలువలో మురుగు తొలగించడం.. స్థానిక పాఠశాల చుట్టూ పేరుకున్న చెత్తను శుభ్రం చేయడం వంటి పనులు చేస్తుండటంతో గ్రామస్తులు సర్పంచ్‌ను అభినందిస్తున్నారు. మంగళవారం సర్పంచ్ కుర్వ నాగర్జున హెచ్‌ఎం శ్రీనివాస్‌తో కలిసి పాఠశాలను సందర్శించారు. కురుస్తున్న వర్షాలతో ఇబ్బందులు పడుతున్నారా? అని ఆరా తీశారు. పాఠశాల ఎదుట ఉన్న మురుగు కాల్వలో పెద్ద చెట్టుపడటంతో స్థానికులతో కలిసి చెట్టును తొలగించారు. ఆయన వెంట బోయిని నర్సింహులు, మొగులప్ప, నందు, శ్రీకాంత్, మహేందర్, శేఖర్, నరేశ్, ఆశప్ప, మాసప్ప, లక్ష్మప్పలు ఉన్నారు.



కోట్‌పల్లి ప్రాజెక్టు అలుగు వద్ద వరద ఉధృతి



అలుగు పారుతున్న లక్నాపూర్ ప్రాజెక్ట్

వాగులు పరవళ్లు.. చెరువులు మత్తళ్లు

జిల్లాలో ఎడతెరిపిలేకుండా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. వాగులు, వంకలు పరవళ్లు తొక్కుతున్నాయి. చెరువులు, కుంటలన్నీ మత్తళ్లు దూకుతున్నాయి. ప్రధాన జలాశయాలన్నీ నిండుకుండలను తలపిస్తున్నాయి. ఈ నెలలో ఇప్పటి వరకు 368 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావడం విశేషం. జూలైలో సాధారణ కంటే రెడింతల వర్షపాతం నమోదైంది. పూర్తిస్థాయిలో నీరు చేరడంతో రైతులు పొలం పనుల్లో బిజీగా ఉన్నారు.

వారం రోజులుగా కురుస్తున్న వానలు

- నిండుకుండల్లా ప్రధాన ప్రాజెక్టులు
- వారం రోజుల్లోనే పూర్తిస్థాయి నీటిమట్టాలు
- సాధారణం కంటే రెండింతలు వర్షపాతం నమోదు

జిల్లాలో మొత్తం చెరువులు:	1,179	పూర్తిస్థాయిలో నిండినవి:	689



ఉధృతంగా ప్రవహిస్తున్న జుంటివాగు

వికారాబాద్: జిల్లాలో ప్రతి ఏటా సెప్టెంబర్ మాసాంతంలో చెరువులు అలుగులు పారేవి. ఈ ఏడాది జూలై నెల కూడా పూర్తి కాకుండానే చాలా చెరువులన్నీ నిండుకుండలను తలపిస్తున్నాయి. వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జిల్లాలోని చెరువులు, ప్రాజెక్టులు నిండిపోయాయి. చెరువులు, కుంటలు నిండి అలుగు పారుతుండటంతో కొందరికి మోదం మరికొందరికి ఖేదంలా మారింది. వరినాట్లు వేసుకునే రైతులకు అధిక వర్షాలు ఆశాజనకంగా మారాయి. ఆరు తడి పంటలు వేసిన రైతులకు పొలాలన్నీ జాలువారి పంటలు పాడయ్యే పరిస్థితి నెలకొంది. జూన్‌లో సాధారణ వర్షపాతం 108 మిల్లీమీటర్లు కాగా 96.5 మి.మీ. వర్షపాతమే నమోదయ్యింది. జూలైలో సాధారణ వర్షపాతం 181 మి.మీ. అయితే ఈ నెల 25 నాటికే 368.5 మి.మీ. వర్షపాతం నమోదయ్యింది. అంటే దాదాపు రెండింతలు నమోదు కావడం విశేషం.

ప్రాజెక్టులన్నీ ఫుల్..

జిల్లాలో మొత్తం చెరువులు 1,179 ఉండగా ఇందులో సగానికిపైగా చెరువులు పూర్తిగా నిండిపోయాయి. 689 చెరువులు పూర్తి స్థాయి నీటిమట్టానికి చేరుకున్నాయి. మరో 235 జలాశయాలు 75 శాతం వరకు నిండాయి. చెరువుల్లో ఫీడర్ చానల్స్ (పాటు కాలువలు) సరిగ్గాలేవు. ఆక్రమణలకు గురైన 94 చెరువుల్లో 25 శాతానికి మించి నీరు చేరలేదు. ప్రధాన ప్రాజెక్టులైన లఖ్నాపూర్, జుంటుపల్లి, కోట్‌పల్లి, సర్పన్‌పల్లి, శివసాగర్ ప్రాజెక్టులు పూర్తిగా నిండి అలుగు పారుతున్నాయి. కాకర్లవాగు ప్రాజెక్టు వందశాతం నీటి మట్టానికి చేరుకుంది. మరో 24 గంటల్లో ఈ ప్రాజెక్టు కూడా అలుగుపారే అవకాశం ఉంది. ఇప్పటికి వరద ఉధృతి కొనసాగుతున్న నేపథ్యంలో వర్షాలు ఇలాగే కొనసాగితే మరో రెండు మూడు రోజుల్లో మొత్తం చెరువులు అలుగు పారే అవకాశం ఉందని నీటి పారుదల శాఖ అధికారులు చెబుతున్నారు.

జాలువారుతున్న పొలాలు..

ఆరు లక్షల పైచిలుకు ఎకరాల్లో వానాకాలం పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేయగా, ఇప్పటికే 5.81 లక్షల ఎకరాలల్లో పంటలు సాగు చేశారు. మరో 1.30 లక్షల ఎకరాల్లో వరి సాగవుతుందని అధికారులు చెబుతున్నారు. చెరువులు, కుంటలు, బావులు, బోరుబావుల్లో పుష్కలంగా నీరు రావటంతో వరినాట్లకు సిద్ధమైన రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఇదే సమయంలో ఐదు లక్షల ఎకరాలకు పైగా ఆరుతడి పంటలు సాగు చేసిన రైతులు ఆందోళనకు గురవుతున్నారు. దాదాపు 50 శాతం పంట పొలాలు జాలువారుతున్నాయి. దీంతో పంటలన్నీ పాడయ్యే ప్రమాదం పొంచి ఉందని రైతులు వాపోతున్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టి వారం పది రోజులు ఎండలు కాస్తే పంటలు గట్టెక్కుతాయని వారు ఆశిస్తున్నారు. వరుసబెట్టి కురుస్తున్న వర్షాలు ప్యాడీ రైతుకు ఆనందాన్ని తెచ్చిపెట్టగా ఆరుతడి పంటలు సాగు చేసే రైతులకు దుఃఖాన్ని కలిగిస్తున్నాయి.

కాగ్నా ఉగ్రరూపం..

బషీరాబాద్: భారీ వర్షాలకు కాగ్నానది ఉగ్రరూపం దాల్చింది. వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఉప్పొంగి ప్రవహిస్తోంది. కాగ్నానది పరీవాహక పంట పొలాలాను ముంచెత్తింది. జీవన్గీ దగ్గర కాగ్నానది మరోసారి మహాదేవలింగేశ్వర స్వామి ఆలయాన్ని చుట్టుముట్టింది. అలాగే జుంటివాగు చెక్‌డ్యాం మత్తడి దూకుతోంది. చెరువులు, కుంటల్లోకి భారీగా వరదనీరు చేరడంతో మత్తడి పోస్తున్నాయి. పలు గ్రామాల్లోని లోతట్టు కాలనీలు జలమయమయ్యాయి. ఇళ్లలోకి వరద నీరు చేరడంతో జనం అవస్థలు పడ్డారు.



జీవన్గీలో మహాదేవలింగేశ్వర స్వామి ఆలయాన్ని చుట్టుముట్టిన కాగ్నా నది

లక్నాపూర్‌కు జలకళ

పరిగి: మండల పరిధిలోని లక్నాపూర్ ప్రాజెక్ట్ ఉధృతంగా అలుగుపారుతోంది. ప్రాజెక్ట్ అలుగు పారుతుండటంతో ఆయ గ్రామాల నుంచి సందర్శకులు పోటెత్తారు. అలుగు వద్ద జాలర్లు, ప్రజలు వలలు వేసి చేపలు పడుతున్నారు. ప్రాజెక్ట్ నిండటంతో ఎన్నో గ్రామాల రైతులకు మేలు జరుగుతుందని అధికారులు చెబుతున్నారు. మరోవైపు కురుస్తున్న వార్షాలకు మండలంలోని అన్ని చెరువులూ నిండుకుండలను తలపిస్తున్నాయి.

ఐలమ్మ.. నీవైనా వినమ్మా..



చాకలి ఐలమ్మ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్మికులు

- చాకలి ఐలమ్మ విగ్రహానికి వినతిపత్రం
- పంచాయతీ కార్మికుల వినూత్న నిరసన

తాండూరు రూరల్: గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మె మంగళవారం కూడా సమ్మె కొనసాగింది. ఈ నేపథ్యంలో పట్టణంలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి కార్మికులు వినతిపత్రం సమర్పించి వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. అదేవిధంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఏదైనా ప్రమాదం జరిగి మరణిస్తే రూ.10 లక్షల బీమా వర్తింపజేయాలని కోరారు. సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం ఆగదన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు శాంతప్ప, వెంకటమ్మ, నర్సింహులు, జిలాని, శ్యామప్ప, లక్ష్మి, చందు, అంబరప్ప, శ్రీనివాస్, రాములు, హరీఫ్‌లు ఉన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించండి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న టీపీయూఎస్ నాయకులు

యాలాల: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించి విద్యాభివృద్ధికి సహకరించాలని టీపీయూఎస్ రాష్ట్ర కోశాధికారి కరణం లక్ష్మీకాంతరావు డిమాండ్ చేశారు. మంగళవారం యాలాల డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మణ్‌కు సంఘం తరఫున వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పన్నెండేళ్లుగా పదోన్నతులు, ఐదేళ్లుగా బదిలీలు లేక ఉపాధ్యాయులు తీవ్ర నిరాశలో ఉన్నారన్నారు. ఇప్పటికైనా పాలకులు దృష్టి సారించాలన్నారు. టీపీయూఎస్ మండల అధ్యక్షుడు గాజుల వీరేశం మాట్లాడుతూ.. మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా పాఠశాలలకు అందించిన విలువైన పరికరాలకు భద్రత కల్పించేలా చూడాలన్నారు. పాఠశాలల్లో వాచ్‌మెన్లు, స్కావెంజర్లను నియమించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రెండో పీఆర్సీ కమిటీని నియమించి ఉద్యోగులకు ఐఆర్ ప్రకటించాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో జిల్లా మీడియా కన్వీనర్ బస్వరాజ్, నియోజకవర్గ కన్వీనర్ శ్రీశైలం, మండల కోశాధికారి చంద్రశేఖర్, ఉపాధ్యాయులు సుజాత, నరేష్, భరత్, శ్రీనివాస్, సిద్రామేశ్వర్, అనసూయ తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ ఓటు హక్కు కల్పించండి

అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

దౌల్తాబాద్: మండలంలో అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బీఎల్ఓలు, సూపర్‌వైజర్లకు ఓటరు నమోదు, సవరణపై అవగాహన కల్పించారు. ఓటరు జాబితా పారదర్శకంగా ఉండాలని, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారి వివరాలను నమోదు చేయాలని సూచించారు. ఈవీఎం మిషన్లపై ప్రజలకు అవగాహన కల్పించాలని, పోలింగ్ కేంద్రాల వివరాలలో పొరపాట్లు లేకుండా చూడాలని తహసీల్దారు కృష్ణయ్యకు సూచించారు.



దౌల్తాబాద్: బీఎల్ఓల సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

కార్యక్రమంలో డీటీ చాంద్‌పాష, ఎంపీడీఓ తిరుమలస్వామి, ఎస్ఐ రమేశ్‌కుమార్ తదితరులున్నారు.

ఎన్నికల విధులపై అవగాహన అవసరం

కొడంగల్ రూరల్: ఎన్నికల విధులపై పూర్తిస్థాయిలో అవగాహన అవసరమని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నియోజకవర్గంలోని కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట మండలాలకు చెందిన బీఎల్ఓ (బూత్ లేవల్ ఆఫీసర్స్)లకు జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధులు సజావుగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవడమే కాకుండా ఎన్నికల సంఘం సూచించిన నియమాలను తప్పక పాటించాలన్నారు. అలాగే ఓటరు జాబితా ప్రక్రియలో ఎలాంటి తప్పొప్పులు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ బుచ్చయ్య, డిప్యూటీ తహసీల్దార్లు సురేశ్‌కుమార్, శివకుమార్, బీఎల్ఓలు పాల్గొన్నారు.

'సోషల్'.. హల్‌చల్!



సామాజిక మాధ్యమాల్లో రాజకీయ వేడి

- వ్యక్తిగత దూషణలతో రెచ్చిపోతున్న అధికార పార్టీ శ్రేణులు
- పట్నం, పైలెట్ వర్గాల మధ్య తిట్ల దండకం

తాండూరు: జిల్లా రాజకీయాలు సోషల్ మీడియాలోకి ఎక్కాయి.. వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో నేతల పర్యటనలు ఆగిపోయాయి. దీంతో ప్రధాన పార్టీలకు చెందిన నాయకుల అనుచరులు సోషల్ మీడియాలో హంగామా చేస్తున్నారు. నిన్న మొన్నటి వరకు వాట్సప్ గ్రూపులలో గౌరవప్రదంగా సాగిన సంభాషణలు.. ప్రస్తుతం తిట్ల దండకాలతో పేలుతున్నాయి. మా నాయకుడు గొప్ప అంటే.. మా నాయకుడే గొప్ప అంటూ.. ఎవరికి నచ్చిన విధంగా వారు రెచ్చిపోయి పోస్టులు పెడుతున్నారు. బీఆర్ఎస్ శ్రేణుల మధ్య ఈ వ్యవహారం శ్రుతిమించుతోంది. నిజానిజాలతో సంబంధం లేకుండా ఇష్టారాజ్యంగా విరుచుకు పడుతున్నారు. ఇది ముదిరి పాకాన పడటంతో వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారు.

వాట్సాప్‌లో టికెట్ వివాదం

వర్షాల నేపథ్యంలో రాజకీయ నేతలంతా పర్యటనలు తగ్గించి హైదరాబాద్‌లో తిష్ట వేశారు. ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఎవరికి వారు వాట్సప్, రాజకీయ గ్రూపులు ఏర్పాటు చేసుకుని సోషల్ మీడియాలో రచ్చ చేస్తున్నారు. బీఆర్ఎస్ టికెట్ మా నేతకే వస్తుందంటే.. కాదుకాదు మా నాయకుడికే వస్తుందని గొడవ పడుతున్నారు. మరోవైపు ప్రధాన పార్టీలకు చెందిన ఓ గ్రూపును క్రియేట్ చేసి మాటల యుద్ధం కొనసాగిస్తున్నారు. బీఆర్ఎస్‌నుంచి అసెంబ్లీ అభ్యర్థులను ప్రకటించారంటూ వారం రోజులుగా ఓ జాబితాను వైరల్ చేస్తున్నారు. ఇందులో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి పేరును చేర్చారు. మరో జాబితాలో పట్నం మహేందర్‌రెడ్డి అనుచరులు ఆయన పేరును చేర్చి టికెట్ తమకేనంటూ పోస్టులు పెడుతున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థుల జాబితాలో బీసీ కమిషన్ మెంబర్ శుభప్రద్ పటేల్ పేరు పెట్టి గందరగోళం సృష్టిస్తున్నారు.

అనుచరుల గొడవ

అధికార పార్టీలో తమ నేతల కోసం అనుచరులు రెచ్చిపోతున్నారు. సోషల్ మీడియాలో ఇతర పార్టీ నాయకులు, కార్యకర్తలపై తీవ్ర పదజాలాన్ని వాడుతున్నారు. ఆయా గ్రూపులలో ద్వితీయ శ్రేణి నేతలు ఉన్నప్పటికీ వీరికి సర్ది చెప్పే ప్రయత్నం కూడా చేయడంలేదు. మరోవైపు పలు పార్టీల నాయకులు మత విద్వేశాలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు, పోస్టులతో ఇబ్బందికర వాతావరణం సృష్టిస్తున్నారు.

పార్టీ మారుతారని..

ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి పార్టీ మారుతున్నారంటూ వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. మరోవైపు ఇటీవల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పట్నం మహేందర్‌రెడ్డి పేరును పొందుపర్చి ఓ సంస్థ సర్వే చేసింది. ఈ అంశాలన్నీ సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం కావడంతో ఏది నిజమో..? ఏది అబద్ధమో తెలియక ప్రజలు అయోమయానికి గురవుతున్నారు.

క్లుప్తంగా

మెరుగైన వైద్యం మన బాధ్యత

మాతాశిశు సంరక్షణ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సాయిబాబా



ప్రసవ మహిళకు కేసీఆర్ కిట్టును అందజేస్తున్న సాయిబాబా

కుల్కచర్ల: ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే మహిళలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా మెరుగైన వైద్యం అందించాలని మాతాశిశు సంరక్షణ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సాయిబాబా సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆస్పత్రి రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సూచించారు. గర్భిణులు, ప్రసవం కోసం వచ్చే వారికి సకాలంలో వైద్యం చేయాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. మండల వైద్యాధికారి మాధురి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ చంద్ర ప్రకాష్‌పాల్గొన్నారు.

బాల కార్మికుడికి విముక్తి

బషీరాబాద్: మండల కేంద్రంలోని ఓ మెకానిక్ షాపులో పనిచేస్తున్న జగన్నాథ్(13)కు అధికారులు విముక్తి కల్పించారు. మంగళవారం ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా తాండూరు అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ శశివర్ధ, ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్ మండల కేంద్రంలోని యూసుఫ్ మెకానిక్ షాప్‌లో తనిఖీలు చేశారు. అక్కడ మంతన్‌గౌడ్ గ్రామానికి చెందిన జగన్నాథ్ అనే బాలుడితో పని చేయించడాన్ని గమనించిన అధికారులు విముక్తి కల్పించారు. బాల కార్మికుడితో పనిచేస్తున్న షాపు యజమాని యూసుఫ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వేణుగోపాల్ గౌడ్ తెలిపారు.

సారా తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

బషీరాబాద్: కర్ణాటక నుంచి నాటు సారా తరలిస్తున్న వ్యక్తిని బషీరాబాద్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఎస్‌ఐ వేణుగోపాల్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నీళ్లపల్లి వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులకు కర్ణాటక నుంచి వచ్చిన హన్మంతు బైక్‌ను ఆపారు. అతని బ్యాగ్‌లో తనిఖీలు చేయగా మూడు లీటర్ల సారా బాటిళ్లు లభించాయి. కర్ణాటకలో తక్కువ ధరకు సారా తీసుకువచ్చి తిమ్మాయిపల్లిలో విక్రయిస్తున్నట్లు తెలిపాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'పరిశ్రమ పేలుడు' ఘటనలో మరో కార్మికుడి మృతి

నాలుగుకు చేరిన మృతుల సంఖ్య

షాద్‌నగర్‌రూరల్: పరిశ్రమ పేలుడు ఘటనలో చికిత్స పొందుతున్న వారిలో మంగళవారం మరొక కార్మికుడు మృతి చెందాడు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కాశిరెడ్డిగూడ శివారులోగల బ్లైండ్ కలర్(ప్యాకేజీ కవర్ల పరిశ్రమ)లో ఈ నెల 16న రాత్రి భారీ పేలుడు సంభవించిన విషయం విదితమే. ఈ ప్రమాదంలో పరిశ్రమలో విధులు నిర్వహిస్తున్న 11 మంది కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. ప్రథమ చికిత్స అనంతరం క్షతగాత్రులను మెరుగైన వైద్యంకో సం నగరంలోని డీఆర్‌డీఓ అపోలో ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న వారిలో మనోజిత్‌దాస్(29) మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని వారి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

ఆ నిధులను ఎస్‌ఎన్‌డీపీ పనులకు కేటాయించండి

కలెక్టర్‌కు విన్నవించిన మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: దశాబ్ది ఉత్సవాల సందర్భంగా సీఎం కేసీఆర్ బడంగ్‌పేట కార్పొరేషన్‌కు ప్రకటించిన రూ.50 కోట్లను ఎస్‌ఎన్‌డీపీ నిర్మాణ పనులకు కేటాయించాలని కలెక్టర్ హరీశ్‌కు మేయర్ పారిజాత విన్నవించారు. ఈ మేరకు ఆమె కార్పొరేటర్లతో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ.. గతంలో కురిసిన వర్షాలకు కాలనీలకు వరద ముంపునకు గురవ్వగా ఎస్‌ఎన్‌డీపీ పనులు ప్రారంభించామన్నారు. అందుకు మున్సిపల్ కార్పొరేషన్ నిధులు సుమారు రూ.7కోట్లకు పైగా వెచ్చించామన్నారు. రూ.64కోట్లతో ఎస్‌ఎన్‌డీపీ ప్రణాళికను ఏర్పాటు చేశారు. బడంగ్‌పేట కార్పొరేషన్‌కు రూ.57కోట్లు నిధులు అవసరం ఉందన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో సీఎం కేసీఆర్ ప్రకటించిన రూ.50 కోట్లను ఎస్‌ఎన్‌డీపీ పనులకు కేటాయించేలా నిర్ణయం తీసుకుని పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆయిల్ బాల్.. దోమలు ధమాల్

- ఆయిల్ బాల్స్ వినియోగంతో గత ఏడాది సత్ఫలితాలు
- ఈ సారి కూడా అదే బాటలో పంచాయతీ సిబ్బంది
- తయారీని ప్రారంభించిన జీపీ కార్మికులు

కుల్కచర్ల: దోమల నివారణకు జిల్లా అధికార యంత్రాంగం సూచనల మేరకు క్షేత్రస్థాయిలో అధికారులు వారివారి ఆలోచనలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నారు. కుల్కచర్లలో దోమల నివారణకు ప్రయోగాత్మక చర్యలు చేపడుతున్నారు. ముఖ్యంగా ఆయిల్ బాల్స్ తయారు చేసి వాటిని నీరు నిల్వ ఉన్న కుంటలు, బావుల్లో వేస్తున్నారు. దీంతో సత్ఫలితాలు వస్తున్నాయి.

తయారీ ఇలా..

దోమల నివారణకు ఎన్నో సదుపాయాలు ఉన్నా ముఖ్యంగా ఆయిల్ బాల్స్ విధానం మంచి ఫలితాన్ని ఇస్తోంది. ఎక్కువగా పట్టణ ప్రాంతంలో చేపట్టే ఈ విధానాన్ని నేడు పల్లెల్లో సైతం ప్రయోగాత్మకంగా ఉపయోగిస్తూ దోమల నివారణకు కృషి చేస్తున్నారు. ఆయిల్ బాల్స్ తయారీకి రంపం పొడి (కట్టె పొడి), ఇసుక, సున్నం, ఇంజన్ ఆయిల్ అవసరం అవుతాయి. రంపం పొడి, ఇసుక, సున్నం మిశ్రమాన్ని ఒక బట్టలో లేదా తట్టు సంచిలలో బాల్స్ రూపంలో తయారు చేసి వాటిని ఇంజన్ ఆయిల్‌లో ఒక గంటపాటు నానబెట్టడంతో ఆయిల్ బాల్స్ సిద్ధమవుతాయి. వాటిని మురుగు కాలువల్లో, గుంటల్లో ఒకటి లేదా రెండు బాల్స్ వేయడం ద్వారా దోమలను నివారించవచ్చు.

ప్రయోజనం ఇలా..

డెంగ్యూ వ్యాధికి కారణమైయ్యే దోమల నివారణలో కూడా ఆయిల్ బాల్స్ విశేషంగా ఉపయోగ పడుతున్నాయి. జీహెచ్‌ఎంసీలో ప్రస్తుతం ఇట్టి విధానాన్ని ఉపయోగించి ఆశించిన ఫలితాలను పొందుతున్నారు. రంపపు పొడి, ఇసుక కొద్దిపాటి సున్నం మిశ్రమంతో ఆయిల్‌లో నానబెట్టిన బాల్స్ మురుగు కుంటలలో వేయడం వల్ల బాల్స్‌లో నుంచి నూనె బయటికి వచ్చి ఉపరితలంపై ఒక వలయంగా చేరుతుంది. తద్వార దోమలు ఉపరితలంపై వాలకుండా ఉంటాయి. కుంటలోపలి భాగంలో ఉన్న దోమలు పెట్టిన గుడ్లు, లార్వాలకు ఆక్సిజన్ అందకపోవడంతో అవి నశించిపోతాయి. కుల్కచర్ల గ్రామ పంచాయతీ కార్యాలయంలో గత సంవత్సరం ఆయిల్ బాల్స్ తయారు చేసి గ్రామ పరిధిలోని మురుగు కాలువలు, మురుగునీరు నిల్వ ఉన్న గుంటల్లో వేయడం ద్వార దోమలను నివారించగలిగారు. ప్రస్తుతం కూడా అదే విధానాన్ని అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు.



ఆయిల్ బాల్స్ తయారు చేస్తున్న పంచాయతీ కార్మికులు



ఆయిల్ బాల్స్

గత ఏడాది మంచి ఫలితాలు



దోమల నివారణకు గ్రామ పంచాయతీ పరిధిలో అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నాం. గత ఏడాది ఆయిల్ బాల్స్ ఉపయోగించి దోమలను అరికట్టగలిగాం. ఈ సారి కూడా అదే పద్ధతి అవలంబించాలని నిర్ణయించాం. ఇందులో భాగంగా ఆయిల్ బాల్స్ తయారు చేస్తున్నాం.

– శ్రీనివాస్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి, కుల్కచర్ల

పారిశుద్ధ్యం మెరుగుకు ప్రాధాన్యత



గ్రామ పంచాయతీ పరిధిలో అభివృద్ధితో పాటు పారిశుద్ధ్య మెరుగుకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నాం. పరిసరాల పరిశుభ్రతకు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నాం. స్వచ్ఛత పాటించాలని ప్రజలకు సూచిస్తున్నాం.

– సౌమ్యారెడ్డి, సర్పంచ్, కుల్కచర్ల

ఉద్యోగుల అభ్యున్నతికి కేసీఆర్ కృషి

ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

పరిగి: ప్రభుత్వ ఉద్యోగుల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. వీఆర్‌ఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా క్రమబద్ధీకరించడంపై మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో వీఆర్‌ఏలు సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వీఆర్‌ఏల డిమాండ్లకు మించి కేసీఆర్ మేలు చేశారని పేర్కొన్నారు. అన్ని శాఖల ఉద్యోగులకు సమన్యాయం చేస్తూ పాలన సాగిస్తోందని తెలిపారు. తెలంగాణ తరహా పాలన దేశంలో ఎక్కడా అమలు కావడం లేదన్నారు. సంక్షేమ పథకాలను పేదలకు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కొప్పుల అనిల్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్, ఎంపీపీ అరవింద్‌రావు, జెడ్పీటీసీ హరిప్రియ, నాగిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, మండల అధ్యక్షుడు ఆంజనేయులు, ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే తదితరులు

సమన్వయంతో పనిచేస్తే అభివృద్ధి సాధ్యం



ద్యాచారం గ్రామంలో అభివృద్ధి పనులపై ఆరా తీస్తున్న అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ

వికారాబాద్ అర్బన్: అధికారుల కలసికట్టుగా, సమన్వయంతో పనిచేస్తే అభివృద్ధి సాధ్యమని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. మంగళవారం మండలంలోని పెండ్లిమడుగు, ఎర్రవల్లి, ద్యాచారం గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లోని నర్సరీలు, పల్లె ప్రకృతి వనాలు, క్రీడా ప్రాంగణాలు, వైకుంఠధామాలను పరిశీలించారు. ద్యాచారంలో మొక్కల పెంపకం బాగుందని కితాబు ఇచ్చారు. ఇంకుడు గుంతల ఏర్పాటుపై సంతృప్తి వ్యక్తం చేశారు. హరితహారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించాలని ఆదేశించారు. వర్షాలు పడుతున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా, అలాగే దోమలు వృద్ధి చెందకుండా జాగ్రతలు తీసుకోవాలన్నారు. అనంతరం ఆయా గ్రామాల పంచాయతీ రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ శ్రీనివాసరావు, అటవీ శాఖ జిల్లా అధికారి జ్ఞానేశ్వర్, ఎంపీడీఓ సత్తయ్య, డివిజినల్ పంచాయతీ అధికారి అనిత తదితరులు పాల్గొన్నారు.

పంట పొలాల్లో నీరుండొద్దు



ధారూరులో పత్తి పొలాన్ని పరిశీలిస్తున్న డీఏఓ గోపాల్



పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గోపాల్

ధారూరు: పత్తి, ఇతర ఆరుతడి పంటలు సాగు చేసిన రైతులు పొలాల్లో వర్షపు నీరు నిలవకుండా చూసుకోవాలని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గోపాల్ సూచించారు. ధారూరు వ్యవసాయ క్లస్టర్ పరిధిలో మంగళవారం ఆయన నీరు నిలిచిన పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో నిరవధికంగా కురుస్తున్న వర్షాల కారణంగా పంటలు పాడయ్యే అవకాశం ఉందని తెలిపారు. పొలాల్లో నిలిచిన నీటిని కాల్వల ద్వారా బయటకు పంపాలని సూచించారు. పొలాల్లో నీరు నిలిస్తే పత్తి, కంది, మొక్కజొన్న తదితర పంటలకు నష్టం జరుగుతుందన్నారు. నీటిని బయటకు పంపి 19:19:19 నానో యూరియాని వేసుకోవాలని తెలిపారు. ప్రస్తుతం పత్తి పంటకు రసం పీల్చే పురుగు ఆశిస్తోందని, నివారణకు అసిపేట్ 1.6 గ్రామలు మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. పట్టాదారు పాసు పుస్తకం ఉన్న ప్రతి రైతూ బీమా చేసుకోవాలని సూచించారు. 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు గల రైతులు ఈ పథకానికి అర్హులన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు సంజూ రాథోడ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పంటల పరిశీలన

బొంరాస్‌పేట: మండలంలోని వడిచర్లలో మంగళవారం వ్యవసాయ శాఖ అధికారులు పంటలను పరిశీలించారు. ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు పంట పొలాల్లో నీరు నిలుస్తోందని, తద్వారా పంటలు దెబ్బ తినే అవకాశం ఉందని అన్నారు. వర్షపు నీరు తొలగించి పంటలను కాపాడుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఏడీఏ శంకర్ రాథోడ్ మాట్లాడుతూ.. వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించాలన్నారు. పట్టా పాసుపుస్తకం ఉన్న ప్రతి రైతూ బీమా చేసుకోవాలన్నారు. ఆగస్టు 5వ తేదీ వరకు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ రేణుకా తదితరులు పాల్గొన్నారు.

పంట వివరాల నమోదు చేయండి

పెద్దేముల్: పంట వివరాల నమోదు పకడ్బందీగా ఉండాలని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గోపాల్ ఆదేశించారు. మంగళవారం మండలంలోని రుక్మాపూర్‌లో ఆయన పర్యటించారు. ఏఈఓల పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు బీమాను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పోషకాల కంది



కొడంగల్ ప్రాంతంలో సాగు చేసిన కంది పంట

తాండూరు కందిలో పుష్కలంగా పోషకాలు

- ఇతర వాటితో పోలిస్తే మూడింతలు అధికం
- రుచిలోనూ అగ్రస్థానమే
- ఇక్కడి దిగుబడికి మంచి డిమాండ్
- పలు రాష్ట్రాలకు ఎగుమతి
- ఇటీవల ప్రపంచ స్థాయి గుర్తింపు

కొడంగల్: జిల్లాలోని కొడంగల్, తాండూరు నియోజకవర్గాల్లో పండే కంది పంటకు మంచి డిమాండ్ లభిస్తోంది. పోషకాలు పుష్కలంగా ఉండడం, రుచిలో మేటి కావడంతో ప్రత్యేక గుర్తింపును సంతరించుకుంది. ఈ ప్రాంతంలోని నల్ల రేగడి భూముల్లో కంది పంటను విస్తారంగా సాగు చేస్తున్నారు. ఈ నేలలో పండే కంది పంటకు ప్రత్యేకత ఉంది. చూడడానికి పెద్ద సైజులో ఉంటుంది. రుచికి ఎంతో పేరు గాంచింది. మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. కొడంగల్, తాండూరు ప్రాంతాల్లో పండిన కంది దిగుబడిని తెలంగాణతోపాటు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. ఇటీవల ప్రపంచ స్థాయిలో ఖ్యాతి పొందింది. తాండూరు కంది పప్పులో ప్రొటీన్లు 24 శాతం ఉంటాయి. మిగిలిన పప్పులతో పోలిస్తే ఇది మూడింతలు అధికం. రుచిలో ఈ పప్పుకు మరే ఇతర పప్పులు సాటిరావు. కుక్కర్ అవసరం లేకుండా త్వరగా ఉడుకుతుంది. కంది పప్పు ఉడికే సమయంలో కమ్మటి వాసన వస్తుంది. తాండూరు కందిపై ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణా వ్యవసాయ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు పలు పరిశోధనలు చేశారు. భౌగోళిక గుర్తింపు రావడంతో తాండూరు కందికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరింత ప్రాచుర్యం లభించింది. శాస్త్రవేత్తల పరిశోధనల ప్రకారం వంద గ్రాముల తాండూరు కంది పప్పులో పోషకాలు ఈ విధంగా ఉన్నాయి. ఎనర్జీ 335 క్యాలరీలు, ప్రొటీన్లు 22.3 గ్రాములు, ఫ్యాట్ 1.7 గ్రాములు, సీఏ 7.3 ఎంజీ, థయామిన్ 0.45 గ్రాములు, రైబోఫ్లెవిన్ 0.19 గ్రాములు, నియాసిన్ 2.9 గ్రాములు, విటమిన్ ఏ 132 ఎమ్‌సీజీ ఉంటుందని పరిశోధనల ప్రకారం తెలుస్తోంది.

కంది బోర్డు ఏర్పాటు ఎప్పటికో?

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాతో పాటు వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా సుమారు 50 వేల హెక్టార్లలో కంది పంటను సాగు చేస్తున్నారు. ప్రతి ఏడాది అధిక మొత్తంలో కందులను పండిస్తున్నారు. ఇక్కడి కందులకు మంచి డిమాండ్ ఉంది. రైతులకు గిట్టుబాటు అయ్యే పంటలలో కందులను ప్రధానంగా చెప్పవచ్చు. ఇలాంటి కందుల సంరక్షణకు కంది బోర్డు ఏర్పాటు చేయాలనే డిమాండ్ గత కొన్ని ఏళ్లుగా ఈ ప్రాంతంలో ఉంది. కంది బోర్డు ఏర్పాటు చేయడం వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుందని అధికారులు అంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకొని కంది బోర్డు ఏర్పాటుకు కృషి చేయాల్సిన అవసరం ఉందని రైతులు కోరుతున్నారు.

వ్యక్తి బలవన్మరణం

నందిగామ: మద్యానికి బానిసగా మారిన ఓ వ్యక్తి ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన నందిగామలో మంగళవారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సురేశ్ తెలిపిన ప్రకారం.. నగరంలోని నేరేడ్‌మెట్ ప్రాంతానికి చెందిన రాకేష్(43) తన భార్య స్వప్న ఇద్దరు పిల్లలతో కలిసి 12 ఏళ్ల క్రితం నందిగామకు వలస వచ్చాడు. ఓ అద్దె ఇంట్లో నివాసం ఉంటూ కూలీ పనిచేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఇటీవల రాకేశ్ మద్యానికి బానిసగా మారి కూలీకి వెళ్లడం మానేశాడు. కాగా మంగళవారం సాయంత్రం ఇంట్లో ఎవ్వరు లేని సమయంలో సుమారు 7గంటల ప్రాంతంలో ఇంట్లోని రేకులకు బిగించిన పైపునకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంటికి వచ్చిన భార్య గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చింది. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్‌లోని కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ సురేశ్ తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

బాలుడిపై వీధికుక్కల దాడి

నందిగామ: వీధి కుక్కలు గ్రామాల్లో స్వైర విహారం చేస్తున్నాయి. చిన్నారులు, వృద్ధులు ఒంటరిగా బయటకు వెళ్లాలంటే జంకుతున్నారు. మండల పరిధిలోని ధన్‌సింగ్ తండాకు చెందిన ఉదయ్ నాయక్ అనే బాలుడు మంగళవారం పాఠశాల నుంచి ఇంటికి వెళ్తుండగా వీధి కుక్కలు వెంటబడ్డాయి. భయంతో పరిగెత్తుతున్న బాలుడిని చేతిని కరవడంతో తీవ్ర రక్తస్రావమైంది. గమనించిన తండా వాసులు బాలుడిని వెంటనే షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా తండా వాసులు మాట్లాడుతూ.. నగరంలోని వీధి కుక్కలను అర్ధరాత్రి వేళ గుట్టు చప్పుడు కాకుండా వదిలి వెళ్తున్నారని ఆరోపించారు. దీంతో మనుషులు, మూగజీవాలపై దాడులు తీవ్రమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కుక్కలను తరిమేయాలని కోరుతున్నారు.

ఆటో బోల్తా

విద్యార్థులకు గాయాలు

- ఆర్టీసీ బస్సు రద్దుతో నిత్యం ఇబ్బందులు



ఆటో బోల్తా పడడంతో గాయపడిన విద్యార్థి పరమేశ్

బంట్వారం: ఆటో అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో ఆరుగురు విద్యార్థులు గాయపడ్డారు. ఈ సంఘటన మండలంలోని తొర్మామిడి సబ్‌స్టేషన్ సమీపంలో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. బస్వాపూర్‌కు చెందిన సుమారు 40 మంది విద్యార్థులు బంట్వారం మోడల్ స్కూల్‌లో చదువుకుంటున్నారు. వీరు ప్రతి రోజూ ఇంటి నుంచే రాకపోకలు సాగిస్తున్నారు. ఉదయం వికారాబాద్ బస్సులో స్కూల్‌కు వెళుతున్నారు. సాయంత్రం నడిచే తాండూరు డిపో బస్సును రద్దు చేయడంతో విద్యార్థులు ప్రైవేటు వాహనాల్లో ఇళ్లకు చేరుకుంటున్నారు. సోమవారం సాయంత్రం ఎప్పటిలాగే బంట్వారం నుంచి బస్వాపూర్‌కు ఆటోలో బయలు దేరారు. మార్గమధ్యలో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో గొల్ల పరమేశ్ అనే విద్యార్థికి కాలు విరిగింది. మరో ఐదు మంది స్వల్పంగా గాయపడ్డారు. ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి తాండూరు డిపో బస్సును పునరుద్ధరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పల్లెల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు



ఎస్సీ కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

- షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్
- రూ.30లక్షల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన


షాద్‌నగర్: పల్లెల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. మంగళవారం ఆయన రూ.15లక్షలతో నిర్మిస్తున్న కుందేలుకుంట పంచాయతీ భవన నిర్మాణానికి, చింతగూడలో రూ.15లక్షలతో నిర్మిస్తున్న ఎస్సీ కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం లబ్ధిదారులకు 69 యూనిట్ల గొర్రెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తున్నారన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని చెప్పారు. ఈకార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేశ్, ఎంపీపీ ఖాజా ఇద్రీస్ అహ్మద్, వైస్ ఎంపీపీ మౌనిక, లక్ష్మీ, లక్ష్మణ్ నాయక్, బాలు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక

మండల పరిధిలోని గంట్లవెల్లి గ్రామానికి చెందిన బీజేపీ, బీఎస్పీ పార్టీలకు చెందిన పలువురు నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. బీజేపీకి చెందిన అఖిల్, అశోక్ యాదవ్, నందీశ్వర్, శివకుమార్, విశాల్‌గౌడ్, వినోద్‌కుమార్, ప్రవీణ్, రాఘవేందర్, ఆనంద్, హరికృష్ణ, రఘు, బీఎస్పీకి చెందిన శివకుమార్, బాల్‌రాజ్, శ్రీనివాస్, మిద్దె నర్సింలు, వీరేందర్, శ్రీశైలం, ప్రశాంత్, రవి, యాదయ్య, గణేశ్, రమేశ్, రఘునాథ్, ప్రేమ్‌రాజ్, వెంకటయ్య, కృష్ణలు ఎమ్మెల్యే సమక్షంలో గులాబీ గూటికి చేరారు.

ప్రియుడితో గొడవపడి వాగులో దూకిన మహిళ

గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు



నిర్మలమ్మ(ఫైల్)



వాగువద్ద గాలింపు చర్యలు పర్యవేక్షిస్తున్న ఎస్‌ఐ దేవకి

షాద్‌నగర్‌రూరల్: ప్రియుడితో గొడవపడిన మహిళ వాగులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని అయ్యవారిపల్లి శివారులో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ దేవకి తెలిపిన ప్రకారం.. కొందుర్గు మండలం ఆగిర్యాలకు చెందిన గుమ్మడి నిర్మలమ్మ(36), ఎల్లయ్య దంపతులకు ఒక బాలిక సంతానం. నిర్మలమ్మ కొన్నేళ్లుగా భర్తకు దూరంగా ఉంటోంది. ఈ క్రమంలో తొమ్మిదేళ్లుగా తలకొండపల్లికి చెందిన రవీందర్‌తో సహజీవనం చేస్తోంది. రవీందర్ ఈ నెల 24న అయ్యవారిపల్లిలోని స్నేహితుడి ఇంటికి వెళ్లాడు. రాత్రయినా ఇంటికి రాకపోవడంతో నిర్మలమ్మ రవీందర్‌కు ఫోన్ చేసి సమాచారం తెలుసుకుంది. మంగళవారం ఉదయం అయ్యవారిపల్లికి వెళ్లి రవీందర్‌తో గొడవపడింది. నన్ను పట్టించుకోవడం లేదు.. నేను చనిపోతాను అంటూ గ్రామ సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులో దూకింది. గమనించిన స్థానికులు ఆమెను కాపాడేందుకు యత్నించినా వరద ఉధృతి ఎక్కువగా ఉండడంతో నీటి ప్రవాహంలో కొట్టుకుపోయింది. సమాచారం అందుకున్న పట్టణ సీఐ ప్రతాప్ లింగం, ఎస్‌ఐ దేవకి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అగ్నిమాపక సిబ్బందితో గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభించలేదు. బాధితురాలి తల్లి సుగుణమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ దేవకి తెలిపారు.